తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

హైదరాబాద్ : fb.com/vaartha

PUBLISHED FROM HYDERABAD, VIJAYAWADA, VISAKHAPATNAM, RAJAHMUNDRY, KADAPA, NIZAMABAD, ONGOLE, WARANGAL, TIRUPATHI, ANANTAPUR, KURNOOL, KARIMNAGAR, MAHABUBNAGAR, KHAMMAM, NELLORE, NALGONDA, GUNTUR, TADEPALLIGUDEM,SRIKAKULAM

8-8-2022 సోమవారం సంపుటి : 28 సంచిక : 189, పేజీలు : 10+4 వెల : 6.50






## స్వతంత్ర భారత వజ్రోత్సవాలు

08-08-2022 నుంచి 22-08-2022 వరకు

తెలంగాణ రాష్ట్రం

## ఇంటింటా జాతీయ పతాకాన్ని ఎగరేద్దాం!
## స్వతంత్ర భారత కీర్తిని దశదిశలా చాటుదాం!!

75వ స్వతంత్ర భారత వజ్రోత్సవాలను ఘనంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించింది. స్వతంత్ర పోరాట యోధులను స్మరిస్తూ వారి స్ఫూర్తితో ప్రగతి పయనం కొనసాగించాలని గౌరవ ముఖ్యమంత్రి శ్రీ కె.చంద్రశేఖర్‌రావు గారు యావత్ ప్రజలకు పిలుపునిస్తున్నారు.. ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగరేసి భారతకీర్తిని దశదిశలా చాటాలని కోరుకుంటున్నది తెలంగాణ ప్రభుత్వం. తెలంగాణ నేడు సంక్షేమ రాష్ట్రంగా దేశవ్యాప్తంగా కీర్తిగాంచింది. అన్ని రంగాలకు 24 గంటల నిరంతరాయ విద్యుత్ అందిస్తూ వెలుగులు విరజిమ్ముతున్నది. సుస్థిర పాలనతో సంక్షేమాన్ని పంచుతూ సర్వమతాలనూ సమాదరిస్తూ శాంతికి నెలవుగా విరాజిల్లుతున్నది. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం దిశగా ఆదర్శవంతమైన పల్లెలు, పట్టణాలతో జాతీయ స్థాయిలో ప్రశంసలందుకుంటున్నది. అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షిస్తూ పరిశ్రమలకు స్వర్గధామంగా పేరొందింది. 75 ఏండ్ల స్వతంత్ర భారతంలో తెలంగాణ రాష్ట్రం యావత్ దేశానికే దిశా నిర్దేశం చేస్తున్నది.

రాష్ట్ర ప్రజలకు స్వతంత్ర భారత వజ్రోత్సవ శుభాకాంక్షలు

### స్వతంత్ర భారత వజ్రోత్సవ ద్విసప్తాహంలో భాగంగా నిర్వహించే రోజువారీ కార్యక్రమాలు...

| | |
|---|---|
| 08-08-2022 | స్వతంత్ర భారత వజ్రోత్సవాలు గౌరవ ముఖ్యమంత్రి గారిచే హెచ్ఐసిసి, హైదరాబాద్‌లో ప్రారంభోత్సవం |
| 09-08-2022 | ఇంటింటికీ జాతీయ పతాకాల పంపిణీ మొదలు. జాతీయ పతాకాలు కలెక్టర్లకు అందజేయబడతాయి. గౌరవ మంత్రులచే అన్నిజిల్లా కేంద్రాలలో పంపిణీ ప్రారంభం. కలెక్టర్లు జాతీయ పతాకాలను అన్ని మండలాలు మరియు గ్రామపంచాయితీలకు పంపాలి. ప్రతీ కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలి. ప్రతీ ఇంటిపై జెండా ఎగిరేలా చూడాలి. జెండా ఎగరవేసే నియమాలను తప్పక పాటించాలి |
| 10-08-2022 | వన మహోత్సవం-మొక్కలు నాటడం. |
| | ఫ్రీడం పార్కుల ఏర్పాటు. అన్ని గ్రామ పంచాయతీలు, పట్టణ స్థానిక సంస్థలలో మొక్కలు నాటడం. |
| 11-08-2022 | ఫ్రీడం రన్ - పోలీస్ శాఖ సమన్వయంతో అన్ని మండలాలు/పట్టణ స్థానిక సంస్థలలో ఫ్రీడం రన్ |
| 12-08-2022 | జాతీయ సమైక్యత రక్షాబంధన్ |
| | స్థానిక టీవీ నెట్‌వర్క్ ద్వారా దేశభక్తి కార్యక్రమాల ప్రసారాలకు విజ్ఞప్తి |
| 13-08-2022 | విద్యార్థులు, ఉద్యోగులు, ఎన్‌సిసి / ఎన్ఎస్ఎస్ / స్కౌట్స్ మరియు గైడ్స్‌చే జెండా మరియు ప్లకార్డ్‌లతో ర్యాలీలు. అన్ని గ్రామపంచాయితీలు / పట్టణ స్థానిక సంస్థలలో పెద్ద మైదానాలలో సమావేశాలు మరియు మూడు రంగుల బెలూన్లు ఎగరవేయడం |
| 14-08-2022 | అన్ని జిల్లా / నియోజక వర్గాల కేంద్రాలలో జానపద కళాకారుల ప్రదర్శన. తెలంగాణ సాంస్కృతిక సారథి సమన్వయంతో జానపద కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు. |
| | సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాలలో బాణాసంచా వేడుకలు |
| 15-08-2022 | స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు |
| 16-08-2022 | తెలంగాణ వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయితీలు, పట్టణ స్థానిక సంస్థలలో యస్‌పి / సిపిల సమన్వయంతో ఏక కాలంలో సామూహిక జాతీయ గీతాలాపన. జిల్లాలలో కవి సమ్మేళనాలు |
| 17-08-2022 | అన్నిజిల్లా కేంద్రాలలో రక్తదాన శిబిరాలు. డియం& హెచ్‌ఓ, యన్‌జిఓల సమన్వయంతో కనీసం 75 మంది దాతలచే రక్తదాన శిబిరాలు ఏర్పాటు |
| 18-08-2022 | ఫ్రీడం కప్ - ఉద్యోగులు / యువతకు ఆటల పోటీలు. |
| | జిల్లా, మండల స్థాయిల్లో క్రీడాశాఖ సమన్వయంతో ఉద్యోగులకు ఆటల పోటీలు |
| 19-08-2022 | ఆస్పత్రులు, వృద్ధాశ్రమాలు, అనాథ శరణాలయాలు, జైళ్లలో ఖైదీలకు పండ్లు, మిఠాయిల పంపిణీ |
| 20-08-2022 | అన్ని గ్రామ పంచాయితీలు, పట్టణ స్థానిక సంస్థలలో స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు దేశభక్తి అంశంగా ముగ్గుల పోటీలు |
| 21-08-2022 | అసెంబ్లీ ప్రత్యేక సమావేశం. ఇతర స్థానిక సంస్థల ప్రత్యేక సమావేశాలు |



## స్వతంత్ర భారతాన సముజ్వల తెలంగాణ

జారీ చేసిన వారు: కమీషనర్, సమాచార పౌరసంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

## ప్రశాంతంగా ఎస్‌ఐ అర్హత పరీక్షలు

### 91.32 శాతం మంది హాజరు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** రాష్ట్ర పోలీసు శాఖలో సివిల్‌తో పాటు ఇతర విభాగాల్లో ఎస్‌ఐ తత్సమాన పోస్టులకు సంబంధించి 554 ఖాళీల భర్తీ కోసం ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన అర్హత పరీక్షలకు రెండు లక్షల 25 వేల 759 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ పోస్టుల కోసం మొత్తం రెండు లక్షల 47 వేల 217 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా వీరి కోసం రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలలో 538 పరీక్షా కేంద్రాలను పోలీసు శాఖ ఏర్పాటు చేసింది. ఇందులో 503 కేంద్రాలు జంట నగరాలు, శివార్లలోనే ఏర్పాటయ్యాయి. ఈ అర్హత పరీక్షలు ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరగగా ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసింది. మొత్తం మీద పరీక్షకు హాజరైన అభ్యర్థుల శాతం 91.32గా నమోదయ్యింది. పరీక్షా కేంద్రాలకు అభ్యర్థులను ఉదయం తొమ్మిది గంటలకే అనుమతించగా పది గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చిన వారిని ఎవరిని రానివ్వలేదు. పరీక్షా కేంద్రాలకు వచ్చిన అభ్యర్థుల బయోమెట్రిక్ ద్వారా హాజరు పట్టికను వేలి ముద్రలద్వారా, డిజిటల్ ఫోటోలను నమోదు చేశారు.

## టిఆర్‌ఎస్‌కు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు గుడ్‌బై

### సొంత పార్టీలోనే నా అనుచరులపై కేసులు పెట్టారు

**కాశీబుగ్గ, ఆగస్టు 7, ప్రభాతవార్త:** టీఆర్‌ఎస్ పార్టీకి మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సోదరుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు రాజీనామా చేశారు. ఆదివారం టీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేసిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదివసంతాలు టిఆర్‌ఎస్ పార్టీలో సేవ చేసిన తనకు మోసాలతో కూడిన మర్యాద అవమానాలతో కూడిన ఆత్మగౌరవం మిగిలిందన్నారు. రెండు దశాబ్దాల సామాజిక రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లను, కష్ట నష్టాలను చూశానని తెలిపారు. తొమ్మిదేళ్ల టీఆర్‌ఎస్ అనుభవంలో గౌరవ మర్యాదలతో పాటు ఆత్మాభిమానం కోల్పోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అధికార పార్టీలో ఉంటూ సొంత పార్టీ నాయ కులే తన కార్యకర్తలపై కేసులు పెట్టినా భరించానన్నారు. అయినా తనను నమ్ముకున్న కార్యకర్తలకు సముచిత న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. భవిష్యత్ రాజకీయం కోసం ఇంకా నిర్ణయం తీసుకోలేదని, తన అనుచరులతో అభిమానులతో మాట్లాడి ఆదరించే పార్టీ వైపు వెళ్లానన్నారు. ఏ పార్టీలో చేరేదనే విషయం త్వరలో వెల్లడిస్తానని అన్నారు.

## గాంధీభవన్‌లో ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం

**హైదరాబాద్, ఆగస్టు 7 ప్రభాతవార్త:** జాతీయ చేనేత దినోత్సవాన్ని గాంధీభవన్‌లో ఘనంగా నిర్వహించారు. చేనేత విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు మన్న రవికుమార్, రాష్ట్ర చేనేత సెల్ వర్కింగ్ చైర్మన్ రమేష్‌ల ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా నేతన్నల విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఓబిసి సెల్ చైర్మన్ నూతి శ్రీకాంత్, రాష్ట్ర పద్మశాలి నాయకులు రాపోలు జయప్రకాష్, పున్న రామలింగం నేత, గుర్రంశంకర్, నరేందర్, పారిజాత నర్సింహారెడ్డి, గ్రేటర్ మహిళాకాంగ్రెస్ అధ్యక్షులు మచ్చ వరలక్ష్మిలు పాల్గొన్నారు.

**చేనేత కళలను బిజెపి చంపేస్తోంది: రేవంత్‌రెడ్డి**

దేశంలో చేనేత కళను చంపేందుకు బిజెపి ప్రయత్నం చేస్తుందని టిపిసిసి అధ్యక్షులు రేవంత్‌రెడ్డి అన్నారు. చేనేత మీద 12శాతం జిఎస్‌టి వేస్తుందన్నారు. చేనేత కార్మికుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. నేతన్నలకు అన్యాయం చేస్తున్న బిజెపి దోపిడి ముఠాకు తెలంగాణాలో స్థానం లేకుండా చూడాలన్నారు.


## దిగుమతులను తగ్గించి ఎగుమతులు పెంచాలి

### నీతిఆయోగ్ సమావేశంలో ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఆగస్టు 7:** దేశంలోని అన్ని రాష్ట్రాల సమిష్టికృషి, సహకార సమాఖ్య తత్వంతో భారత్‌లో కొవిడ్‌వ్యాప్తిని అరికట్టగలిగామని ప్రధాని నరేంద్రమోడీ పేర్కొన్నారు. నీతి ఆయోగ్ ఏడో పాలకవర్గ మండలి సమావేశంలో మాట్లాడుతూ మహమ్మారి ఉధృతి కాలంలోప్రతి రాష్ట్రంకూడా కీలకపాత్రపోషించిందని, క్షేత్రస్థాయికి ప్రభుత్వసేవలు అందేటట్లు ప్రతి ఒక్కరాష్ట్రంలోను కృషిజరిగిందని అన్నారు. ఈక్రమంలోనే భారత్ అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఒక ఉదాహరణగా నిలిచిందని, కొవిడ్ కట్టడి కార్యాచరణలో గ్లోబల్ లీడర్‌గా నిలిచిందని అన్నారు. ఈ ఏడాది పాలకమండలిలో నాలుగు కీలక అంశాలను చర్చించింది. వైవిధ్యభరితమైన పంటల సాగు, పప్పుదినుసుల్లో స్వయంసమృద్ధి, నూనెగింజలు, ఇతర అగ్రి ఉత్పత్తులపరంగా స్వయంసమృద్ధిని సాధించాలన్న లక్ష్యంతో పనిచేయాలన్నారు. అలాగే జాతీయ కొత్త విద్యావిధానం పాఠశాల విద్యలోకూడా అమలుచేసేందుకు కృషిచేయాలని, ఉన్నతవిద్యలో కూడా జాతీయ విద్యావిధానం అమలుకురావాలని, పట్టణసుపరిపాలన మరింత మెరుగుపరచాలన్ననాలుగు కీలక అంశాలపైనే ఎక్కువచర్చలుజరిగాయి. తన ప్రారంభోపన్యాసంలో ప్రధానిమోడీ వ్యవసాయ ఆధునీకరణ, పశుసంవర్ధకశాఖ, ఆహారశుద్ధి రంగంలో మనం స్వయంసమృద్ధిని సాధించాలని, వ్యవసాయరంగంలో గ్లోబల్ లీడర్‌గా ఎదగాలని మోడీ కోరారు. శరవేగంగా జరుగుతున్న పట్టణీకరణలో టెక్నాలజీ సాయంతో సులభతర జీవనశైలి, పారదర్శకసేవల పంపిణీ, జీవనశైలి ప్రమాణాలను మెరుగుపరుచుకోవాలని పేర్కొన్నారు. 2023లో భారత్ జి20 దేశాల సదస్సుకు అధ్యక్షత వహిస్తోందని, ఇదొక అరుదైన అవకాశమని ప్రపంచానికి భారత్ కేవలం ఢిల్లీకేపరిమితం కాదని, ప్రతి రాష్ట్రం, కేంద్రపాలితప్రాంతంలోను అభివృదిన ధసాగుతుందన్నదని ప్రపంచానికి చాటిచెప్పినవారం అవుతామన్నారు. దేశంలో నిబిడీకృతమై ఉన్న ప్రతిభను వెలికి తీయాలని, జి20 సదస్సుద్వారా రాష్ట్రాలకు గరిష్టస్థాయిలో ప్రయోజనాలు అందేవిధంగా కృషిజరగాలని సూచించారు. ప్రతిరాష్ట్రం కూడా వాణిజ్యం, పర్యాటకరంగం, టెక్నాలజీలకు అత్యధికప్రాధాన్యతనిచ్చి పనిచేయాలని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ దౌత్యకార్యాలయాలద్వారా విస్తృత ప్రోత్సాహం కల్పించాలన్నారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గాలని, ఎగుమతులను పెంచుకోవాలన్నారు. ఎగుమతులకు కొత్త మార్కె ట్లను అన్వేషించాలని సూచించారు. జిఎస్‌టి రాబడులు మెరుగుపడ్డాయని, అయినా కూడా ఎగుమతులకు మరిన్ని అవకాశాలున్నాయని అన్నారు. జిఎస్‌టి రాబడులు సమిష్టికృషితోనే పెరుగుతున్నాయని, రానున్న కాలంలో భారత్ ఐదులక్షలకోట్ల డాలర్ల ఆర్థికవ్యవస్థగా ఎదిగేందుకు ఈ లక్ష్యాలు మద్దతిస్తాయని అన్నారు. అంతకుముందు విదేశాంగమంత్రి ఎస్‌జైశంకర్ మాట్లాడుతూ జి20చరిత్రలోనే మొదటిసారి భారత్ జి20 సమావేశాలను ఏడాదిపాటునిర్వహిస్తున్నదని, కేవలం ఢిల్లీలోనే కాకుండా ప్రతి రాష్ట్రం, కేంద్రపాలిత ప్రాంతాల్లోను జరుగుతాయని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ మాట్లాడుతూ జాతీయ విద్యావిధానం అమలులో రాష్ట్రాల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రస్తుతం లక్షకోట్లవిలువైన వంటనూనెలను దిగుమతిచేసుకుంటున్నామని, తద్వారా మొత్తం వంటనూనెల డిమాండ్‌లో 50శాతం దిగుమతులతోనే సర్దుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో పప్పుదినుసులకు కనీస మద్దతుధరలు ఉండాలని, నూనెగింజనలకు కూడా అదేస్థాయిలో ధరలు కల్పించాలని రాజస్థాన్‌ముఖ్యమంత్రి అశోక్‌గెహ్లోత్ చెప్పారు. అంతేకాకుండా తమ రాష్ట్రంలో ఆముదం సాగుకోసం 13 జిల్లాల్లో మంచి నీటిపారుదల వసతులు కల్పించాలనిసూచించారు. గడచిన ఐదారేళ్లలో పప్పుదినుసుల సాగు వృద్ధి చెందిందని, కంది, మినుము సాగులో స్వల్పస్థాయిలో మాత్రమే లోటు ఉందని అన్నారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్‌భాగల్ మాట్లాడుతూ జిఎస్‌టిపరిహారం ఐదేళ్లకు పొడిగించాలని సూచించారు. సమావేశానికి తెలంగాణ సిఎం కె.చంద్రశేఖరరావు, బీహార్‌సిఎం నితీష్‌కుమార్‌లు హాజరుకాలేదు. సమావేశంలో 23 రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరై తమతమ అభిప్రాయాలను వెల్లడించారు.

## రేపు మొహరం.. పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** ముస్లింలలో షియా వర్గానికి ఎంతో పవిత్రమైన మొహరం మంగళవారం జరగనుంది. మొహరం సందర్భంగా పాతబస్తీలో బీబీకా ఆలం ఊరేగింపు జరగడం తెలిసిందే. త్యాగానికి ప్రతిరూపంగా నిలిచిన మొహరం సందర్భంగా షియా వర్గానికి చెందిన ముస్లింలు రక్త తర్పణం చేయడం ఆనవాయితీ గా వస్తుండడం విదితమే. ఆ వర్గానికి చెందిన యువకులు, వృద్దులు, చిన్నారులు బేడ్లు, చిన్నపాటి కత్తులతో తమ ఒంటిపై గాయాలు చేసుకుని రక్తాన్ని చిందించడం జరుగుతుంటుంది. ఇదంతా పాతబస్తీలోని డబీర్‌పురా చార్మినార్‌ల మధ్య గల రహదారిపై జరుగుతుంది. ఈ సందర్భంగా అంబారీపై బీబీకా ఆలం ఊరేగింపును కూడా నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో ముస్లింలతో పాటు హిందువులు కూడా పాల్గొంటారు. అన్ని వర్గాల వారు ప్రత్యేకంగా భక్తి శ్రద్దలతో దట్టీలు సమర్పిస్తుంటారు. రాష్ట్రం లోని గ్రామీణ ప్రాంతాలలో హిందువులు మొహరంను పీర్ల పేరిట పిలుస్తుంటారు. కాగా మొహరం సందర్భంగా పాతబస్తీలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు తలెత్త కుండా వుండేందుకు పోలీసులు భారీ ఏర్పాట్లు చేబట్టి పెద్ద ఎత్తున పోలీసులను మొహరించారు. ఉన్నతాధికారులు ఏర్పాట్లను స్వయంగా సమీక్షించసాగారు. కాగా మం గళవారం నాటి మొహరం కోసం పాతబస్తీలో బీబీకా ఆలం ఊరేగింపు సాగే మార్గంలో మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు వి ధించారు. ఆంక్షలు విధించిన మార్గాలలో ట్రాఫిక్‌ను ఇతర మార్గాల ద్వారా మళ్లిస్తారు. ఈ మార్గాలలో ప్రయాణించే వాహనదారులు పోలీసులు సూచించిన మార్గాల మీదుగా ప్రయాణించాలని, పోలీసు సిబ్బందికి సహకరించాలని సిటీ ట్రాఫిక్ చీఫ్ రంగనాథ్ కోరారు.



మొహరం సందర్భంగా పాతబస్తీలో ట్రాఫిక్ ఆంక్షలు విధించిన ప్రాంతాలు

## సర్వాయి పాపన్న యావత్ దేశానికే ఆదర్శప్రాయుడు

### ● త్వరలో ట్యాంక్‌బండ్‌పై అధునాతన సౌకర్యాలతో నీరా కేఫ్: మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**హైదరాబాద్ (రవీంద్రభారతి), ఆగస్టు 7, ప్రభాతవార్త:** సర్దార్ సర్వాయి పాపన్న మహరాజ్ కేవలం తెలంగాణ, తెలుగుజాతికే కాకుండా యావత్ భారతదేశానికే ఆదర్శప్రాయుడని ఎక్సైజ్, సాంస్కృతిక, పర్యాటక, క్రీడా శాఖల మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. సర్వాయి పాపన్న మహరాజ్ 372వ జయంతి జాతీయ వారోత్సవాలను పురస్క రించుకొని జైగౌడ్ ఉద్యమం-జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమం వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు వట్టికూటి రామారావుగౌడ్ సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఎపి గృహనిర్మాణశాఖ మంత్రి జ్యోగి రమేష్‌గౌడ్, ఎమ్మెల్సీ గంగాధర్‌గౌడ్, కనకమామిడి స్వామిగౌడ్, మాజీ ఎమ్మెల్యే కోడూరి సత్య నారాయణగౌడ్ తదితరులతో కలిసి రవీంద్రభారతిలో సర్వాయి పాపన్న చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతిప్రకాసనం చేసి నివాళులర్పించి ప్రసంగించారు. గౌడ కులవృత్తి కల్లు చాలా పవిత్రమైనదని, నేడు ఉభయ రాష్ట్రాలు ఈ వృత్తికే వన్నెతెస్తున్నాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. తెలంగాణలో చెట్టుపన్ను లేదని, లైసెన్స్ 10ఏళ్ల వరకు పొడిగించారని గుర్తుచేశారు. ప్రభుత్వం కొత్తగా నీరా పాలసీని తీసుకువచ్చిందని, నీరా చెట్లనుండి గీయాలన్నా, అమ్మాలన్నా కేవలం గౌడ్‌లు చేయాలని జిఒ తీసుకువచ్చామని, త్వరలో 20 కోట్లతో ట్యాంక్‌బండ్‌పై పెద్దయెత్తున అధునాతన సౌకర్యాలతో నీరాకేఫ్‌ను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అలాగే బెల్లం, చక్కెర తయారీ తదితర బయోప్రొడక్ట్స్ తయారుచేయడానికి నందనం, సిరికొండ తదితర ఐదు ప్రాంతాలను ఏర్పాటు చేసి గీతకార్మికులకు శిక్షణ ఇచ్చే సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వైన్‌షాపుల్లో 15శాతం రిజర్వేషన్ గౌడ్‌లకు జిఒ ద్వారా కల్పించామన్నారు.



టిఎస్, ఎపి రాష్ట్ర మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, రమేష్‌గౌడ్‌లను గజమాలతో ఘనంగా సత్కరిస్తున్న గౌడ నాయకులు

అంతేకాకుండా హైదరాబాద్ నగరంలో గౌడ్‌ల ఆత్మగౌరవ భవన నిర్మాణానికి 5 ఎకరాలు, భవన నిర్మాణానికి 5కోట్ల నిధులను కేటాయించామన్నారు. దీనికి త్వరలో శంకుస్థాపన చేసి అక్కడ శ్రీసర్వాయి పాపన్న ట్రస్ట్ అనే నామకరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాపన్న ఆశయాన్ని, సిద్ధాంతాలను, బహుజన జాతులను ఐక్యం చేసేందుకు డా. వట్టికూటి రామారావుగౌడ్ చేస్తున్న కృషిని కొనియాడారు.

డా. వట్టికోటి రామారావుగౌడ్ అధ్యక్షోపన్యాసంలో గత పాలకుల తప్పిదాల వల్ల పాపన్న చరిత్ర నిర్లక్ష్యం చేయబడిందని వాపోతూ సర్దార్ పాపన్న గౌడ్‌లకే కాదు భారతజాతికే గర్వకారణమన్నారు. ఎపి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి జ్యోగి రమేష్‌గౌడ్ మాట్లాడుతూ బడుగు బలహీ నులను, బహుజనులను నమ్మిన ప్రభుత్వాలకు తిరుగుండదని స్పష్టం చేశారు. చట్టసభల్లో తమ బలాన్ని పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అందుకు తగ్గట్టు ముందడుగు వేయాలని సూచించారు.

## స్పీకర్‌ను స్వయంగా కలిసి రాజీనామా సమర్పిస్తా

### స్పీకర్ కలువకుండా కాలయాపన చేస్తే సెక్రటరీని కలుస్తా: రాజగోపాల్‌రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** తానే స్వయంగా వెళ్లి స్పీకర్‌కి రాజీనామా లేఖ సమర్పిస్తానని కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆగస్టు 8న స్పీకర్ అపాయింట్‌మెంట్ ఇచ్చినట్లు చెప్పారు. స్పీకర్ తనను కలవకుండా కాలయాపన చేస్తే అసెంబ్లీ సెక్రటరీని కలిసి రాజీనామా సమర్పిస్తానని స్పష్టం చేశారు. చండూరు పర్యటనలో భాగంగా ఈ మేరకు వెల్లడించారు. కేంద్ర ఎన్నికల సంఘానికి మెయిల్ ద్వారా రాజీనామా లేఖ పంపుతామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు.

చండూర్, చౌటుప్పల్ మున్సిపాలిటీలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి నిధులు ఇవ్వాలని అసెంబ్లీలో ఎన్నోసార్లు విన్నవించాను. కెసిఆర్, కెటిఆర్‌తో మాట్లాడినా పట్టించుకోలేదు. శేషిలేటి వాగు, వెల్మకన్నె ఫీడర్ ఛానల్ గురించి అధికారులతో చాలా సార్లు మాట్లాడినా స్పందించలేదు. మునుగోడు నియోజకవర్గంలో చిన్న చిన్న పనులకు కూడా కెసిఆర్ నిధులు ఇవ్వలేదు. సిద్ధిపేట, సిరిసిల్ల, గజ్వేల్ మున్సిపాలిటీలను అభివృద్ధి చేశారు. చండూరు, చౌటుప్పల్ మున్సిపాలిటీల అభివృద్ధిపై వివక్ష చూపుతున్నారని ఆయన ఆరోపించారు.

## మునుగోడులో కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రక అవసరం: మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** మునుగోడులో కాంగ్రెస్ పార్టీ గెలుపు చారిత్రక అవసరం అని టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి అన్నారు. ఆదివారం మధ్యాహ్నం టిపిసిసి సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి నివాసంలో పిసిసి సామాజిక న్యాయం బృందం, సోషల్ జస్టిస్ టీం సమావేశం జరిగింది. మునుగోడు ఉప ఎన్నికల్లో చేయాల్సిన కార్యాచరణ గురించి చర్చించారు. మునుగోడు ఉప ఎన్నికల్లో ప్రత్యక్ష కార్యాచరణ తీసుకోవాలని సోషల్ జస్టిస్ టీం మండలాల వారీగా కో ఆర్డినేషన్ బాధ్యతలను తీసుకుంది. ఈ టీంకు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శంకర్‌నాయక్‌తోపాటు మునుగోడు కాంగ్రెస్ మండల అధ్యక్షులతోపాటు టీం సమన్వయంతో ముందుకు వెళ్లాలని నిర్ణ యించుకున్నారు.

## సిఎం కెసిఆర్ తీసుకున్న నిర్ణయాలు రాష్ట్రానికి మంచివి కాదు

### వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ నీతి అయోగ్‌పై చేసిన వ్యాఖ్యలు బాగాలేవని, నీతి అయోగ్ సమావేశానికి వెళ్లకపోవడం సరైన నిర్ణయం కాదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఢిల్లీలో బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బిజెపి బలపడుతుందనే అక్కసుతో తమ అధికారం పోతుందనే భయం ముఖ్యమంత్రికి పట్టుకుందన్నారు. అభద్రతా భావంతోనే వ్యవస్థలపై దుమ్మెత్తిపోస్తున్నారంటూ ఎద్దేవా చేశారు. నీతి అయోగ్ సమావేశం బహిష్కరించడం తెలంగాణాకు మంచిది కాదన్నారు. కెసిఆర్ పాలనలో ఏ వర్గం సంతృప్తిగా లేదని, వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు. కెసిఆర్ నిర్ణయం రాష్ట్ర ప్రజలకు, సమాఖ్య స్ఫూర్తికి మంచిది కాదని, దేశానికి, రాష్ట్రానికి అవసరమైన అంశాలపై చర్చించేందుకు నీతి అయోగ్ అత్యుతన్నత వేదిక అన్నారు. రాజకీయ దురుద్దేశాలతో రాజ్యాంగ సంస్థలను తప్పుపట్టకూడదన్నారు. కెసిఆర్‌కు ప్రధానిని కలవటం ఇష్టం లేకపోతే వెళ్లకుండా ఉండోచ్చు అన్నారు. కానీ నీతి అయోగ్‌ను తప్పుపట్టం ఎంత వరకు సమంజసం అన్నారు. కడుపునొప్పి వస్తే తల నరుక్కున్నట్లుగా కెసిఆర్ విధానం ఉందన్నారు. తెలంగాణలో బిజెపి బలపడిన తరువాత తమ కుటుంబం నుంచి అధికారం చేజారిపోతుందేమోనని ఆవేదన ఉందన్నారు. అభద్రత భావంతో ప్రధానిపై బిజెపిపై విషయ ప్రచారం చేస్తున్నారన్నారు.



ఆగస్టు 15 దేశ చరిత్రలో మరిచిపోలేదని రోజు అన్నారు. అజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలన్నారు. కార్యాలయాలు కాకుండా 20 కోట్లకుపైగా ఉన్న ఇళ్లపై మువ్వెన్నల జెండా ఎగురుతుందన్నారు. ఈనెల 13, 14, 15 తేదీలలో ఇళ్లపై జాతీయ జెండా ఎగురవేయవచ్చునన్నారు.

## కెటిఆర్ చాలెంజ్‌ను స్వీకరించి.. చంద్రబాబు, బాలినేనిలను నామినేట్ చేసిన పవన్

### వెంటనే చేనేత దుస్తులు ధరించిన బాలినేని

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని సోషల్ మీడియాలో చేనేత ఉత్పత్తుల వినియోగం ఛాలెంజ్‌లో పాలుపంచుకున్నారు. ప్రతివారం చేనేత దుస్తులు ధరిస్తానని, చేనేత ప్రచారం కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం ప్రముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా, క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, జనసేనాని పవన్ కళ్యాణ్‌లను నామినేట్ చేశారు. ఈ చేనేత చాలెంజ్‌ను స్వీకరించాల్సిందిగా కోరారు. చేనేత దుస్తులు ధరించిన ఫోటోలు పోస్టు చేయాలని సూచించారు. ఈ చాలెంజ్‌ను జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ స్వీకరించారు. ఆయన స్పందిస్తూ రామ్ భాయ్ విసిరిన చాలెంజ్‌నఉను స్వీకరిస్తున్నానని వెల్లడించారు. ఈ చాలెంజ్‌ను స్వీకరించడానికి చేనేత కార్మికుల పట్ల ఉన్న ప్రేమాభిమానాలే కారణమని పవన్ తెలిపారు. చేనేత వస్త్రాలు ధరించిన పోటోలను సోషల్ మీడియాలో పోస్టు చేయడం ద్వారా చేనేత వస్త్రాల వినియోగానికి మరింత ప్రోత్సాహం పెంచాలని కోరారు. ఈ మేరకు పవన్ కళ్యాణ్ తాను చేనేత వస్త్రాలు ధరించిన ఫోటోలను ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. అనంతరం టిడిపి అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు కె.లక్ష్మణ్‌లను చేనేత ఛాలెంజ్‌కు నామినేట్ చేస్తున్నట్లు ప్రకటించారు. పవన్ ఛాలెంజ్ పట్ల బాలినేని వెంటనే స్పందించారు. చేనేత దుస్తులను ధరించిన ఫోటోను ట్విట్టర్‌లో పంచుకున్నారు. పవన్ కళ్యాణ్ విసిరిన చేనేత ఛాలెంజ్‌ను స్వీకరించానని వెల్లడించారు. వైఎస్సార్ ప్రభుత్వంలో చేనేత మంత్రిగా చిత్తశుద్ధితో పనిచేశానని తెలిపారు. నాడు వైఎస్సార్ రూ.300 కోట్ల మేర చేనేతలకు రుణమాఫీ చేయాలని వివరించారు. దీనిపై పవన్ కళ్యాణ్ స్పందిస్తూ గౌరవనీయ బాలినేని గారూ... నాడు చేనేత కార్మికుల అభ్యున్నతి కోసం మీరు చిత్తశుద్ధితో చేసిన ప్రయత్నాలు అభినందనలకు నోచుకున్నాయి. ఇప్పుడు మీరు నా చాలెంజ్‌ను స్వీకరించి చేనేత కార్మికుల పట్ల మరోసారి మీ అంకిత భావాన్ని ప్రదర్శించినందుకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను సర్' అంటూ పవన్ ట్వీట్ చేశారు.

## నీతి ఆయోగ్ రాజకీయ రంగును బయట పెట్టుకుంది: ఆర్థిక మంత్రి హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, ఆగస్టు 7:** నీతి అయోగ్ రంగును సిఎం కెసిఆర్ బయటపెడితే, దానికి నీతి అయోగ్ రాజకీయ రంగు పులుముకుందని వైద్యారోగ్య, ఆర్థిక శాఖల మంత్రి హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. బిజెపికి వంతపాడుతూ నీతి అయోగ్ నోట్ రిలీజ్ చేయడం సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేశారు. నీతి అయోగ్ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటిస్తూ సిఎం కెసిఆర్ చేసిన ఆరోపణలపై సర్వత్రా దుమారం చెలరేగింది. సిఎం కెసిఆర్ వ్యాఖ్యలను ఖండిస్తూ... నీతి అయోగ్ నోట్ విడుదల చేయటం మరింత చర్చకు దారి తీసింది. కాగా, నీతి అయోగ్ విడుదల చేసిన నోట్‌పై మంత్రి హరీష్‌రావు ఆదివారం తీవ్రంగా స్పందించారు. సిఎం అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పాల్సింది పోయి తప్పుడు ప్రకటన చేశారని నీతి అయోగ్‌పై మంత్రి మండిపడ్డారు. ఆ సంస్థ అంకెల గారడీ చేస్తూ... వాస్తవాలను పూర్తిగా తప్పుదోవ పట్టిస్తోందని ఆరోపించారు. నిధులు ఇచ్చినా వాడుకోలేదని నీతి అయోగ్ తప్పుడు ప్రకటన చేసిందన్న హరీశ్‌రావు, ఆ సంస్థ చెప్పినా కేంద్రం రూపాయి కూడా ఇవ్వలేదని స్పష్టం చేశారు. రూ.3,922 కోట్లు జల్ జీవన్ కింద కేటాయిస్తే రూ. 200 కోట్లు మాత్రమే తెలంగాణ వాడుకున్నదని సత్యదూర ప్రకటన చేసిందన్నారు.

ఇప్పుడు రూ. 1195 కోట్లు, పిఎం కెఎస్‌వై ద్వారా ఇచ్చామంటున్నారని, అసలు దానికి మిషన్ కాకతీయకు ఏమైనా సంబంధం ఉందా? అని ప్రశ్నించారు. రాష్ట్రాలకు కేటాయించే నిధులు 32 నుంచి 42శాతానికి పెంచామంటున్న నీతి అయోగ్ సెస్సులు తెచ్చి రాష్ట్రానికి రావాల్సిన వాటా రాకుండా చేశారన్నారు. బిజెపి ప్రభుత్వం ఏడేళ్లలో సెస్సెల రూపంలో రూ.15,47,560 కోట్లు సమకూర్చుకుందని, ఈ ఏడాది రూ.5,35,112 కోట్లు, మొత్తం 21 లక్షల కోట్లు సమకూర్చుకుందన్నారు. అసలు రాష్ట్రాలకు 42శాతం కాదు కదా 29.6శాతం వస్తున్నదని, పన్నుల్లో వాటా పెంచామని అది అబద్దమన్నారు. ఇందిరాగాంధీ, వాజ్‌పేయి, మన్మోహన్ ప్రభుత్వాలు ఆర్థిక సంఘం సిఫార్సులను కచ్చితంగా అమలు చేశాయని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. మోడీ ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందన్నారు. ప్రగతి పథంలో దూసుకెళ్తున్న తెలంగాణపై ద్వేషం ఎందుకు? అని మంత్రి ప్రశ్నించారు. ఆర్థిక సంఘం సిఫార్సులను మోడీ ప్రభుత్వం అమలు చేయలేదన్న హరీశ్‌రావు... దానిపై నీతి అయోగ్ ఎందుకు ప్రశ్నించిందని అడిగారు. నీతి అయోగ్ ప్రకటన సత్యదూరమని ఆరోపించిన మంత్రి... కెసిఆర్ అడిగిన ఏ ప్రశ్నకు సమాధానం ఇవ్వలేదని మండిపడ్డారు.

## తెలుగు రాష్ట్రాల నేతలను టార్గెట్ చేసిన ఇడి

### క్యాసినో వ్యవహారం.. పలువురికి తాఖీదులు.. నేటి నుంచి విచారణ?

**హైదరాబాద్, ఆగస్టు 7, ప్రభాతవార్త:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన క్యాసినో వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఇప్పటి వరకు ఈ కేసులో హైదరాబాద్‌కు చెం దిన వ్యాపారులు చీకోటి ప్రవీణ్, దాసరి మాధవరెడ్డి, ట్రావెల్ ఏజెంట్ సంపత్ సహా వారి అనుచరులు మరో ఐదుగురిని విచారించిన ఈడీ తాజాగా క్యాసినోలలో వీరి తో కలిసి పాల్గొన్న రాజకీయ నాయకులను టార్గెట్ చేసినట్లుగా తెలుస్తోంది. ప్రవీణ్, మాధవరెడ్డిలతో కలిసి శ్రీలంక, నేపాల్, ఇండోనేషియా, థాయ్‌లాండ్‌లలో అక్కడి క్యాసినోలకు వెళ్లిన తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలు, బడా బాబుల చిట్టాను ఇప్పటికే సేకరించిన ఈడీ వీరిని సోమవారం నుంచి విచారించేందుకు సిద్ధమవు తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో కొందరు రాజకీయ నేతలకు ఈడీ ఇప్పటికే తాఖీదులు పంపిందని వార్తలు వస్తున్నాయి. ఈడీ నుంచి తాఖీదులు అందుకున్న వారి లో తెలంగాణకు చెందిన ఇద్దరు మంత్రులతో పాటు ఐదారుగురు ఎంఎల్‌ఎలు, ఎంఎల్‌సిలు వున్నట్లు తెలుస్తోంది. వీరితో పాటు ఎపి నుంచి ఇద్దరు ఎంఎల్‌ఎలు, ఇద్దరు ఎంఎల్‌సిలు కూడా ఈడీ నుంచి తాఖీదులు అందుకున్నట్లు సమాచారం. సోమవారం నుంచి క్యాసినో వ్యవహారంలో రాజకీయ నేతలను ఈడీ విచారిస్తే ఈ అంశం రాజ కీయ మలుపు తీసుకునే అవకాశం కనిపిస్తుంది.

క్యాసినోలు (అన్ని వసతులు కలిగిన ఖరీదైన జూద గృహాలు). వీటి గురించి రెండు వారాలుగా తెలుగు రాష్ట్రాలలో పెద్ద చర్చ జరుగుతుండడం తెలిసిందే. నగరంలోని సైదాబాద్‌కు చెందిన చీకోటి ప్రవీణ్, బోయిన్‌పల్లికి చెందిన దాసరి మాధవరెడ్డి, అదే ప్రాంతానికి చెందిన సంపత్‌లతో పాటు మరో ఐదుగురి ఇళ్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (ఈడీ) ఇటీవల దాడులు నిర్వహించి పెద్ద ఎత్తున నగదు జప్తు చేయడం, పత్రాలు స్వాధీనం చేసుకోవడం, అనంతరం ఈ ఎనిమిది మందిని విచారించడం విదితమే. మొదట ఎనిమిది మందిని ఆ తరువాత ప్రవీణ్, మాధవరెడ్డి, సంపత్‌లను నాలుగు రోజుల పాటు గంటల తరబడి విచారించి వందల సంఖ్యలో ప్రశ్నలకు సమాధానా లు సేకరించిన ఈడీ వీటి ఆధారంగా మరికొందరిని విచారించే వీలుందని వార్తలు వచ్చాయి. ప్రవీణ్, మాధవరెడ్డి, సంపత్‌ల నుంచి సేకరించిన వివరాలలో తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలు వుండడం సంచలనం రేపింది. మామూలుగా అయితే ఇది పెద్ద విషయమేమీ కాదు. క్యాసినోలపై తెలుగు రాష్ట్రాలతో పాటు అనేక రా ష్ట్రాలలో నిషేధం వున్నా గోవాలో వీటికి లైసెన్స్ వుంది. అక్కడ చట్టబద్ధంగా అనేక క్యాసినోలు వుండడంతో దేశ విదేశాలకు చెందిన వందలాది మంది నిత్యం వస్తుంటా రు. అక్కడి క్యాసినోలకు వ్యాపారులను, బడా బాబులను, జూద ప్రియులను రప్పించేందుకు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలలో లోకల్ ఏజెంట్లు వున్నారు. తెలుగు రాష్ట్రా లలో ప్రవీణ్, మాధవరెడ్డిల తరహాలో ఇతర రాష్ట్రాలలోను గోవా క్యాసినోలకు ఏజెంట్లు వున్నారు. వీరంతా గోవా క్యాసినోలకు తమ తమ ప్రాంతాలకు చెందిన వారిని ఎరవేసి తీసుకువెళ్లాలి. ఇలా చేసినందుకు అక్కడి క్యాసినో నిర్వాహకులు దండిగా కమీషన్ ఇస్తుంటటారు. ఒక్క గోవానే కాదు శ్రీలంక, నేపాల్ సహా ఇతర దేశాలలో వు న్న క్యాసినోలకు కూడా ఇదే తరహాలో ఏజెంట్లు వుంటారు. వారికి కూడా ఇలాగే కమీషన్ అందుతుంటుంది. ఇదంతా ప్రపంచ వ్యాప్తంగా జరిగే వ్యవహారమే. భారత్‌లో కూడా చాలా కాలంగా జరుగుతోంది. అయితే ఇటీవల కాలంలో ఐటి, ఈడీ అధికారులు ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలోని నేతలు, వ్యాపారులను, రియల్టర్లు, సినిమా రం గానికి చెందిన వారిపై వరుసగా దాడులు చేస్తుండడం చేస్తున్న ఘటనలు వరుసగా జరుగుతున్నాయి.

హైదరాబాద్‌కు చెందిన క్యాసినో ఏజెంట్లు ప్రవీణ్, మాధవరెడ్డి, ట్రా వెల్ ఏజెంట్‌లపై ఈడీ దాడులు కూడా ఈ కోవలోకే వస్తాయని పలువురు చెబుతున్నారు. ఈ దాడుల సందర్భంగా మొదట తనకు ఎలాంటి రాజకీయ నేతలతో సంబం ధాలు లేవని చెప్పినా ఆ తరువాత తనకు అనేక మంది రాజకీయ నాయకులతో పరిచయం వుందని ప్రవీణ్ మీడియాకు చెప్పడం హాట్ టాఫిక్‌గా మారింది. ఇదే సమ యంలో క్యాసినోలకు వెళ్లడం నేరమేమి కాదని, ఎవరికి నచ్చిన దాంట్లో వారు పాల్గొనడం తప్పేమికాదని ప్రవీణ్ చెప్పడం కలకలం రేపింది. ప్రవీణ్, మాధవరెడ్డిల సెల్ ఫోన్లలో వున్న టెలిఫోన్ నంబర్లు, వాట్సాప్ చాటింగ్, మెసేజ్‌లను ఈడీ అధికారులు పరిశీలించి ఇందులోని నేతల వివరాలు సేకరించి వారిని విచారించేందుకు సిద్ధమ వుతున్నారని తెలిసింది.

ఈ విచారణ అంతా క్యాసినోలకు వెళ్లినందుకు కాకుండా వాటికి జరిగిన నగదు చెల్లింపులు ఎలా జరిగాయనే కోణంలో రట్టు చేసేందుకేనని ఈ డీ అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రవీణ్, మాధవరెడ్డిలు తెలుగు రాష్ట్రాలకు చెందిన వందలాది మంది జూద ప్రియులను గోవాతో పాటు శ్రీలంక, నేపాల్ సహా ప లు దేశాలలో వున్న క్యాసినోలకు తీసుకువెళ్లినట్లు తేలడం తెలిసిందే. అయితే ఇందుకోసం పదుల కోట్ల రూపాయలు చేతులు మారడం కూడా విదితమే. ఈ డబ్బులు ఎ లా వెళ్లాయి...? అనేది ఇప్పటి వరకు తేలలేదు. మామూలుగా అయితే ఈ డబ్బులు హవాలా రూపంలోనే వెళుతుంటాయి. జూద ప్రియుల నుంచి హవాలా ఏజెం ట్లు నగదు తీసుకుని వాటిని ఆయా దేశాలలోని క్యాసినోల తరపు ఏజెంట్లకు పంపుతుంటారు. ఇలా చేయడం చట్ట విరుద్ధం. దీనివల్ల కేంద్రానికి రావాల్సిన పన్నుల వా టా రాదు. ఈ కోణంలోనే ప్రవీణ్, మాధవరెడ్డిలు విదేశాలలోని క్యాసినోలకు తరలించిన తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజకీయ నేతలు, ఇతర బడాబాబులను ఈడీ వి చారించాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. కాగా ఈడీ విచారణలో క్యాసినోలలో పందాలు కాసిన డబ్బులు ఎలా తరలించారు...? ఇందుకోసం మీ వద్దకు వచ్చిన హ వాలా ఏజెంట్లు ఎవరు...? ఎంత మొత్తం తరలించారు...? ఎన్నిసార్లు తరలించారు...? ఇలా చేయడం చట్ట విరుద్ధమని మీకు తెలుసా...? అనే అంశాలే ఎక్కువగా వుండే అవకాశాలు వున్నాయి. ఇదే సమయంలో ప్రవీణ్, మాధవరెడ్డిలతో ఎప్పటి నుంచి పరిచయం వుంది...? వీరితో కలిసి ఏ ఏ దేశాలలోని క్యాసినోలకు వెళ్లారు..? మీతో పాటు వచ్చిన ఇతర నేతల వివరాలు ఏమిటీ...? క్యాసినోలలో పాల్గొన్న సమయంలో మీరు గెలిచిన సొమ్ము ఎంత...? ఓడింది ఎంత...? అనే అంశాలపైనే ఈ డీ విచారణ సాగే వీలుందని సమాచారం. క్యాసినోల వ్యవహారంలో నగదు తరలింపు హవాలా రూపంలో జరిగిందని ఇప్పటికే ఈడీ తేల్చడం తెలిసిందే. ఇందుకుగా నూ టోకెన్ల విధానం అమలయిన వైనాన్ని కూడా ఈడీ రట్టు చేయడం విదితమే. ఈ వివరాల ఆధారంగా క్యాసినోలకు హాజరైన రాజకీయ నేతలను ఈడీ ప్రశ్నలతో ఉ క్కిరిబిక్కిరి చేసే వీలుందని తెలుస్తోంది.

